క్లుప్తంగా

సెఫ్టీ జాకెట్, హెల్మెట్ల పంపిణీ



వెంకటాపురం(ఎం): మహాశివరాత్రి సందర్భంగా రామప్పలో విధులు నిర్వహించే విద్యుత్ సిబ్బందికి సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సెఫ్టీ జాకెట్‌లు, హెల్మెట్‌లను అందించినట్లు ములుగు ట్రాన్స్‌కో డీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఓవర్‌లోడ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రమేష్, సబ్ ఇంజనీర్ సాంబరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు..



వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోదెబోయిన పరమేశ్వరావు అతడి తండ్రి సుబ్బయ్య ఆరో వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లను సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు, స్వరూప్‌సింగ్, కౌసల్య, చంద్రలీల, మంగ, ఈశ్వరి, సాయమ్మ, బీమయ్య ఉన్నారు.

గిరిజన సొసైటీల ద్వారానే క్వారీలు నడపాలి

ఏటూరునాగారం: ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజన సొసైటీల ద్వారానే ఇసుక క్వారీలను నిర్వహించాలని జిల్లా గిరిజన ఇసుక కోఆపరేటివ్ ఫెడరేషన్ కన్వీనర్ ఈసం రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో క్యూబిక్ మీటరకు ఇచ్చిన మాదిరిగానే రూ.450లు చెల్లించాలన్నారు. నూతన విధానం వల్ల గిరిజన సొసైటీలు నష్టపోతాయన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి భరత్‌రెడ్డి, మండల కేంద్రానికి చెందిన సతీశ్ మూడు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావన్ కుమార్ సోమవారం అందజేశారు. సెల్‌ఫోన్ గుర్తించడంలో సహాయపడిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఎక్కడైనా సెల్‌ఫోన్లు దొరికితే పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

టేకుమట్ల: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సోమనపల్లి గ్రామానికి చెందిన మారపెల్లి రాజకొమురయ్య (60) మండల కేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంకుషాపూర్ గ్రామానికి చెందిన బిక్కనూరి సతీశ్ ద్విచక్ర వాహనంతో మండల కేంద్రం నుంచి అంకుషాపూర్‌కు వస్తు రాజకొమురయ్యను ఢీ కొట్టాడు. అతడికి తీవ్రగాయాలు కావడంతో 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

ఒకరికి గాయాలు



రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలోని రైస్‌మిల్ ఎదుట సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బలుగూరి రాజు ఆటోలో పరకాలకు వెళ్తుండగా ఆటో ముందు వెళ్తున్న టాటాఏస్ వాహనం టైరు పేలడంతో అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ క్రమంలో వెనక నుంచి వస్తున్న ఆటో అదుపు తప్పి టాటాఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహణంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ముస్తాబవుతున్న ఆలయాలు



ఏటూరునాగారం: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం



ఏటూరునాగారం: రామన్నగూడెంలోని శివాలయం



వాజేడు: శివాలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

- శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు



వాజేడు: రంగులతో తీర్చిదిద్దిన ప్రగళ్లపల్లి శివాలయం

ఏటూరునాగారం: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 26న శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు, చలువ పందిళ్లు వేస్తున్నారు. శివాలయాలకు రంగులు, విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. ఏటూరునాగారంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్ తెలిపారు. మండలంలోని షాపెల్లి వద్ద రాజన్నగుట్టపై కొలువై ఉన్న స్వామివారి కల్యాణం వేడుకలకు పచ్చని పందిరి వేస్తున్నారు. అలాగే రామన్నగూడెంలోని గోదావరి ఒడ్డున ఉన్న శివాలయంలో ఏర్పాట్లను చేపట్టారు.

వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి, ప్రగళ్లపల్లి, అయ్యవారిపేట గ్రామాల్లో శివపార్వతుల కల్యాణానికి భక్తులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. రేపు (బుధవారం) రాత్రి స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అయ్యవారిపేట గ్రామంలో గోదావరి సమీపంలో ఆలయాన్ని పునఃప్రారంభించి స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు వేశారు. అదే విధంగా జంగాలపల్లిలో గ్రామంలో శ్రీ ఉమామహేశ్వరస్వామి ఉత్సవ కల్యాణం నిర్వహించేందుకు కొంగాల వాగు సమీపంలో సిద్ధం చేశారు. ప్రగళ్లపల్లి గ్రామంలో సతీ సమేత శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి వారి కల్యాణానికి దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు. పందిల్లు వేయడంతో పాటు లైటింగ్ ఏర్పాట్లను చేపట్టారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఉమా రామాలింగేశ్వస్వామి ఆలయాన్ని ఈనెల 26 నుంచి మార్చి 02వ వరకు నిర్వహించే శివ కల్యాణానికి నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. 26న స్వామి వారి కల్యాణ మహోత్సవం, 27న స్వామి వారి ఊరేగింపు సేవా, 28న రుద్ర హోమం, 01న దొంగల దొపు కార్యక్రమం, 02న వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లను చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చలువ పందిల్లు, తాగు నీటి సౌకర్యం కల్పించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నారు.



ఏటూరునాగారం : రాజన్నగుట్టపై వేస్తున్న చలువ పందిరి



వెంకటాపురం(కె)లోని శివాలయం

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ములుగు: జిల్లా కేంద్రంలో నగరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాగరణ ఉత్సవాల కరపత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరై మాట్లాడారు. ఈ నెల 26న నగరేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శివుడికి అభిషేకాలు, సాయంత్రం 7 గంటల నుండి శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గాదం కుమార్, కొత్తపెల్లి బాబురావు, రాజుకుమార్, శంకర్, రవి, ఓం ప్రకాశ్, జోహర్, కృష్ణకర్‌రావు, రవి రెడ్డి, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి

భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ.. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గీస సంపత్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పట్టణంలోని కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. సరోత్తంరెడ్డి సోదరుడు పులి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొని టీచర్లకు కరపత్రాలను అందిస్తూ ఓట్లను అభ్యర్థించారు. జిల్లా ఎన్నికల ప్రతినిధి దుప్పటి భద్రయ్య, జిల్లా నాయకులు దొంగల రాజేందర్, తాటికంటి రవికుమార్, కృష్ణారెడ్డి, రమేశ్, వేణు, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- వైద్యాధికారి స్నేహ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న స్నేహ

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి స్నేహ అన్నారు. మండల పరిధిలోని చొక్కాల, రంగరాజాపురం, సూగూరు, వీరభద్రవరం, ఆలుబాక గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా, ఎదిర పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ సందర్శించారు. వైద్యశాలలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నూరు శాతం లక్ష్యం సాధించేలా కృషి చేయాలని వైద్య అధికారులకు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్ కుమార్, స్నేహ, డీపీఎంఓ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన



శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

వాజేడు: మండల పరిధిలోని అయ్యవారిపేట గ్రామంలోని శివాలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు అత్తలూరి బాలశంభరశాస్త్రీ, గ్రామ పురోహితుడు రంగు రవీంద్రచారి ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగింది. స్వామి వారి విగ్రహంతో పాటు పార్వతీదేవి, వినాయకుడు, కుమారస్వామి, సూర్య భగవానుడు, శివ లింగాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎస్సై రాజ్‌కుమార్



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

వాజేడు: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగారంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు వాజేడు, వెంకటాపురం(కె), కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. కాగా, ఈ పోటీలను ఎస్సై సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ క్రీడాకారుడు క్రీడా దృక్పథంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, నాయకులు దాట్ల వాసు, కల్యాణ్, సీతాలు, సోమ సత్యనారాయణ, యువకులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని ధర్మవరం, పేరూరు గ్రామాల్లో పోలీసులు నార్కోటిక్ స్నీపర్ డాగ్‌తో తనిఖీలను నిర్వహించారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దుకాణలను సోదాలు చేశారు. ఛత్తీసగఢ్ నుంచి వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు స్నీపర్ డాగ్‌తో తనిఖీ చేయించారు. ప్రధానంగా గంజాయి పైనే దృష్టిని కేంద్రీకరించి ఈ తనిఖీలు నిర్వహించారు.

ముహూర్తం ఖరారు



ముహూర్తం ఖరారు చేస్తున్న అర్చకులు, సభ్యులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఏప్రిల్ 16న ప్రతిష్ఠాపన చేపట్టనున్నట్లు భద్రకాళి ఆలయ అర్చకుడు శ్రీ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గ్రామస్తులు, భక్తులు, అయ్యప్పస్వామి మాలధారుల సమక్షంలో ప్రతిష్ఠాపన ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొలుసానిగౌరీ శంకర్, ఉపాధ్యక్షుడు అల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యం, కోశాధికారి పర్వతాల లాలయ్య, సమ్మయ్య, గోపి, జయకృష్ణ, సాంబయ్య, యాదిరెడ్డి, ప్రభాకర్, రఘు, ప్రభాకర్, పాపన్న, రమేశ్, వెంకటేశ్వర్లు, నారాయణ భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ములుగు: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు పిట్టల మధుసూదన్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఈఓ అల్లం రాజుకుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలబడే పాత్రికేయుల పరిస్థితి రాష్ట్రంలో దారుణంగా తయారైందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ నూతన అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడు ఎండీ షఫీ, జర్నలిస్టులు భూక్య సునీల్, జలిగపు కిరణ్, నర్రా రఘువీర్, సామ బుచ్చిరెడ్డి, ఆవుల వెంకన్న, ఎండీ రఫీ, గజ్జి రాజేష్, హరినాథ్, సుమన్, భిక్షపతి, రాజేందర్, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని వినతి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ బహుజన సమాజ్‌వాది పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. మిర్చి పంట దిగుబడులు తగ్గడంతో పాటు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దినికి తోటు దళారులు మిర్చి పంటకు ధర తగ్గించి కొనుగోలు చేస్తు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

'ప్రశ్నించే వారిని గెలిపిద్దాం..'

కాటారం: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించి పోరాడే అభ్యర్థిని ఓటర్లు గెలిపించుకోవాలని సామాజిక కార్యకర్త పీక కిరణ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పట్టభద్రులు ఏకమై నిరుద్యోగులకు అండగా నిలిచే వారికి మాత్రమే పట్టం కట్టాలని తెలిపారు. అగ్రవర్ణాలకు, అణగారిన వర్గాలకు జరుగుతున్న పోరాటంగా ఎన్నికలను గుర్తించాలని అన్నారు. విద్యా, వ్యాపార రంగాల్లో కోట్ల రూపాయలు దండుకున్న దళారులు ఓట్ల కోసం తిరుగుతున్నారన్నారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంపన్న



క్రీడాకారులతో జంపన్న తదితరులు

ములుగు: యువత అన్ని రంగాల్లో ముందుండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంపన్న తెలిపారు. మెదక్ జిల్లాలో ఈ నెల 27 నుంచి మార్చి 2 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు అండర్ 14 జిల్లా బాలుర టీం వెళ్లనున్నారు. కాగా వారికి జపన్న సోమవారం టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఎదగడానికి కావాల్సిన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో రమేష్, నునావత్ రాజశేఖర్, రాజేందర్, ఎండీ యూసఫ్, నేరెళ్ల శ్రీకాంత్, రాజన్నతో పాటు తదితరులు ఉన్నారు.

ఫాస్టాగ్ చెక్ పోస్టు వద్ద రోడ్డు నిర్మాణం



జేసీబీతో చేపడుతున్న సర్వీస్‌రోడ్డు పనులు

ఏటూరునాగారం: మండలంలోని ఏటూరునాగారం 163 జాతీయ రహదారిపై అటవీశాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫాస్టాగ్ చెక్ పోస్టు వద్ద సర్వీస్ రోడ్డును నిర్మిస్తున్నారు. మండలంలోని ఫోర్‌వీల్ వాహనాలకు ఎలాంటి రుసుము లేకుండా వెళ్లేందుకు ప్రత్యేక రోడ్డు నిర్మాణం పనులను అధికారులు సోమవారం చేపట్టారు. దీంతో ఫాస్టాగ్ ముందు నుంచి కాకుండా వెనుక నుంచి వెళ్లే విధంగా వాహనదారులకు వెసులుబాటును కల్పించనున్నారు. దీంతో లోకల్ వాహనదారులకు ఫాస్టాగ్ నుంచి ఊరట కలిగింది.

బీజేపీతోనే సమస్యల పరిష్కారం

- బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: బీజేపీతోనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లకు బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ సరోత్తంరెడ్డికి ఓటు వేయాలని ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం బీజేపీ ఎన్నో ప్రయత్నాలు చేస్తోందన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం: మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో వలెంకుంట బ్రేకర్ సాంకేతిక లోపం ఏర్పడటంతో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాటారం, మల్హర్ మండలాల్లో సుమారు నాలుగు గంటల పాటు త్రి ఫేస్ విద్యుత్ నిలిచిపోగా కొన్ని గ్రామాలకు సింగిల్ ఫేస్ కరెంట్ సరఫరా జరిగింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఎస్ఈ మల్హార్ సబ్ స్టేషన్‌కు చేరుకొని సాంకేతిక సమస్యపై ఆరా తీశారు. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టారు. తాడిచర్ల, కొయ్యూర్ ఫీడర్లకు లోడ్ మార్చుకుంటూ తాత్కాలికంగా సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తూ మరమ్మతు చర్యలను కొనసాగించారు. సుమారు 3.30 గంటల పాటు శ్రమించి పూర్తి స్థాయిలో విద్యుత్ సమస్యను పరిష్కరించారు. వేసవి కాలం ప్రారంభం అవుతుండటంతో విద్యుత్ వినియోగం పెరిగి లోడ్ ఎక్కువ అవుతుందని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సమస్య పరిష్కారంలో భాగంగా కాటారం మండల కేంద్రంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పులి సంచారంపై అన్వేషణ



మల్హర్: పులి సంచారంపై ఫారెస్ట్ అధికారులు అన్వేషణ చేపట్టారు. రెండు రోజుల క్రితం మండలంలో కాపురం అటవీ ప్రాతంలోని చెరువు శివారులో అనుమానాస్పద స్థితిలో ఆవు మృత్యువాత పడిన ఘటనపై రెండో రోజు సోమవారం పులి, ఇతర అటవీ జంతువుల పాదముద్రలపై ఎనిమిల్ ట్రాకర్లతో గాలించినట్లు కొయ్యూరు రేంజర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. అన్వేషణలో ఆవుపై పులి దాడి చేసిన ఆనావళ్లు ఏమి లేవని పేర్కొన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో ఆవు ఈననుండగా ఈ క్రమంలో మృతి చెందినట్లు ఆయన స్పష్టం చేశారు.